సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)

మంగళవారం | 28 | మార్చి | 2023



గంజాయితో పట్టుబడిన..
కాజీపేటలో సోమవారం 2.100 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్ రెడ్డి తెలిపారు. -8లో▸



ఈ'సారీ' లోటే!
కేయూలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి వార్షిక అంచనాల బడ్జెట్ రూ.389 కోట్లకుపైగా ప్రవేశ పెట్టబోతున్నట్లు సమాచారం. -8లో▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
36.0°/24.0°
జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు మేఘాలతోపాటు సూర్యరశ్మితో ఎండగా ఉంటుంది. పొడి వాతావరణంతోపాటు రాత్రి పూట చల్లగా ఉంటుంది.



న్యూస్‌రీల్

నేడు ఉచిత క్యాన్సర్ పరీక్ష శిబిరం

హన్మకొండ అర్బన్: కలెక్టర్ సూచన మేరకు ఒమేగా బన్ను హాస్పిటల్ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10 నుంచి సాయంత్రం వరకు కలెక్టరేట్ కార్యాలయంలో మహిళా ఉద్యోగులకు ఉచిత క్యాన్సర్ పరీక్షల శిబిరం నిర్వహించనున్నట్లు తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ జగన్మోహన్ రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్ష ద్వారా బ్రెస్ట్ క్యాన్సర్, సర్వైకల్ క్యాన్సర్ తదితర వ్యాధులను తొలిదశలో కనుగొనే అవకాశం ఉంటుందని తెలిపారు. మహిళా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఒకటిన ఉద్యోగ మేళా

విద్యారణ్యపురి: హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్ల ఆధ్వర్యంలో హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ వారు నిర్వహిస్తున్న టెక్ బీ ప్రోగ్రాం కొరకు 2022-23లో ఇంటర్మీడియట్ ఎంపీసీ, ఎంఈసీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 1న ఉదయం 9 గంటలకు వరంగల్‌లోని ఏవీవీ జూనియర్ కళాశాలలో మేగా ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు డీఐఈఓ గోపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాస్ సర్టిఫికెట్ జిరాక్స్ కాపీ, ఇంటర్ 2023 సంవత్సరం వారు అయితే ఫస్టియర్ జిరాక్స్ కాపీ, ఒక ఫొటో, ఆండ్రాయిడ్ మొబైల్‌తో హాజరు కావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు హెచ్‌సీఎల్ ప్రతినిధిని 75691 77071 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

'ఆర్‌టీహెచ్'ను ఉపసంహరించుకోవాలి



ఎంజీఎం: రాజస్థాన్ ప్రభుత్వం రాజ్యాంగ విరుద్ధంగా శాసనసభలో ఆమోదించిన ఆర్‌టీహెచ్-2023 చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ఐఎంఏ ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ చట్టానికి వ్యతిరేకంగా నగరంలో ఐఎంఏ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఐఎంఏ ప్రతినిధులు మాట్లాడుతూ ఆర్‌టీహెచ్-2023 ప్రకారం రాజస్థాన్‌లో ప్రైవేట్ రంగంలో సైతం అత్యవసర పరిస్థితుల్లో ఉచిత చికిత్స అందించడానికి వీలు కల్పిస్తుందని, కానీ.. ఇందులో అత్యవసర పరిస్థితి అంటే ఏమిటో నిర్వచించడంలో విఫలమైందన్నారు. ఈ చట్టం లోపభూయిష్టంగా ఉండడమే కాకుండా ఇప్పటికే పెలుసుగా ఉన్న ప్రైవేట్ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థ పతనంతో సహా ఊహించలేని పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అనంతరం వరంగల్ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు వద్దిరాజు రాకేశ్, కార్యదర్శి సనత్‌కుమార్, కోశాధికారి అజిత్ మహ్మద్, డాక్టర్ కాశీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేటి మహా ధర్నాను విజయవంతం చేయాలి



విద్యారణ్యపురి: ఉద్యోగ, ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం హైదరాబాద్‌లో ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టబోయే మహాధర్నాను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ పిలుపునిచ్చారు. సోమవారం హనుమకొండలో నిర్వహించిన సంఘం వరంగల్ జిల్లాస్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు ప్రతీ నెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలన్నారు. అలాగే అనే రకాల బిల్లులు పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ బాధ్యులు ఆర్థిక శాఖ మంత్రికి, రాష్ట్ర పభుత్వ ప్రధాన కార్యదర్శికి, ఫైనాన్స్ సెక్రటరీ, సీఎంఓలకు వినతులు సమర్పించినా స్పందన లేదన్నారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయదర్శిని సంపాదకులు వి.అజయ్‌బాబు, ఉపాధ్యక్షుడు జె.స్వామి, కార్యదర్శులు మనోజ్‌గౌడ్, వీరస్వామి, వీరభద్రం, సీనియర్ బాధ్యులు స్వామి, ఉట్కూరు అశోక్, విష్ణువర్ధన్, వెంకట్ పాల్గొన్నారు.

నాయిని X జంగా

వరంగల్ పశ్చిమ కాంగ్రెస్‌లో ముదిరిన వైరం
- పోటాపోటీ కార్యక్రమాలతో పార్టీ శ్రేణుల్లో అయోమయం
- పరస్పర విమర్శలతో వేడెక్కిన రాజకీయాలు
- తాజా పరిణామాలపై టీపీసీసీ ముఖ్యుల ఆరా?



సాక్షిప్రతినిధి, వరంగల్: ఓరుగల్లు కాంగ్రెస్‌లో వర్గ పోరు తారస్థాయికి చేరింది. వరంగల్ పశ్చిమ నియోజకవర్గంలో నేతల మధ్య నెలకొన్న గందరగోళం పార్టీ శ్రేణులను అయోమయానికి గురిచేస్తోంది. పార్టీలోని అంతర్గత ప్రజాస్వామ్యంతో హనుమకొండ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్, జనగామ జిల్లా మాజీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి మధ్య పొలిటికల్ వార్ సాగుతోంది. వ్యక్తిగత విమర్శలతోపాటు పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించారని జంగాను పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగించి.. సస్పెండ్ చేస్తూ సోమవారం అధిష్టానానికి సిఫార్సు చేశారు నాయిని రాజేందర్‌రెడ్డి. జంగా తానేమీ తక్కువ కాదన్నట్లు తనను సస్పెండ్ చేసే అధికారం నాయినికి లేదంటూ, అవసరమైతే ఆయననే సస్పెండ్ చేస్తున్నట్లు జంగా ప్రకటించి పార్టీకి లేఖ రాయనున్నట్లు మీడియా సమావేశంలో ప్రకటించారు.

రచ్చకెక్కిన కాంగ్రెస్ రాజకీయం

పకడ్బందీ వ్యూహంతో పార్టీ అధిష్టానం ముందడుగు వేస్తుంటే.. పార్టీలో నెలకొన్న అంతర్గత ప్రజాస్వామ్యం, నేతల మధ్య గ్రూప్ రాజకీయాలు పార్టీ శ్రేణులను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఉమ్మడి వరంగల్‌లో ఈ పరిస్థితి నాలుగైదు నియోజకవర్గాల్లో ఉన్నా.. అందుకు మొదటగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గం వేదికగా మారింది. రాజకీయ జగడం నాయిని వర్సెస్ జంగా అన్నట్లు సాగుతోంది. పలుమార్లు ప్రయత్నించినా చివరి నిమిషంలో టికెట్ దక్కని నేపథ్యంలో రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ టిక్కెట్ దక్కించుకోవడమే లక్ష్యంగా రాజేందర్‌రెడ్డి పని చేస్తున్నారు. ఇదే సమయంలో 2018లో పాలకుర్తి అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలైన జంగా రాఘవరెడ్డి కూడా ఈసారి ఇక్కడి నుంచే పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. ఈ క్రమంలోనే ఇద్దరు నేతలు పోటాపోటీగా నియోజకవర్గంలో పర్యటిస్తున్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్ర కూడా వేర్వేరుగా చేస్తున్నారు.

పోటాపోటీ ప్రెస్‌మీట్లు.. కాంగ్రెస్ శ్రేణుల్లో కలవరం

సోమవారం జిల్లా కేంద్రాల్లో నిరసన దీక్షలు ఉండగా.. కాజీపేటలో జంగా రాఘవరెడ్డి పోటీ నిరసన దీక్ష చేపట్టడం కలవరం సృష్టిస్తోంది. డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి దీనిని తీవ్రంగా పరిగణిస్తూ జంగా రాఘవరెడ్డిని పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగిస్తూ సస్పెన్షన్‌కు పార్టీ అధిష్టానానికి సిఫార్సు చేశారు. నాలుగేళ్లలో 20 సార్లు పార్టీ అధిష్టానానికి ఫిర్యాదు చేశానని, జంగాపై చర్యలు తీసుకోని పక్షంలో తాను నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. దీనిపై స్పందించిన జంగా రాఘవరెడ్డి కాజీపేటలో మీడియాతో మాట్లాడుతూ 'కాంగ్రెస్ పార్టీ నుంచి నన్ను సస్పెండ్ చేసే అధికారం డీసీసీ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డికి లేదు.. ఆయననే నేను సస్పెండ్ చేస్తూ అధిష్టానానికి లేఖ రాస్తున్నా..' అంటూ వ్యక్తిగత ఆరోపణలు చేశారు. తాను స్థానికుడినని.. రాజేందర్‌రెడ్డి కాదని.. ఎట్టి పరిస్థితుల్లో వరంగల్ పశ్చిమలో పోటీ చేసి తీరుతానని స్పష్టం చేశారు. కాగా.. తాజా ఘటనపై టీపీసీసీ ముఖ్యులు ఆరా తీయడం చర్చనీయాంశంగా మారింది.

'జంగా'కు సహకరిస్తే చర్యలు

డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నాయిని రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: అధిష్టానం పలుమార్లు హెచ్చరించి, షోకాజ్ నోటీసులు ఇచ్చినా వాటిని విస్మరించి వ్యవహరిస్తున్నందుకు డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డిని కాంగ్రెస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వం నుంచి తొలగించినట్లు హనుమకొండ డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి ప్రకటించారు. హనుమకొండలోని కాంగ్రెస్ భవన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జంగాపై నాయిని నిప్పులు చెరిగారు. గత ఏడాది జూలై 26న టీపీసీసీ క్రమశిక్షణ సంఘం మా ఇద్దరితో మాట్లాడి వరంగల్ పశ్చిమలో కార్యక్రమాలు చేపట్టొద్దని సూచించిందని గుర్తు చేశారు. అయినా పార్టీకి నష్టం వాటిల్లేలా రాఘవరెడ్డి పాదయాత్రలు చేస్తున్నాడని, దీనిపై అధిష్టానం హెచ్చరికలను ఖాతరు చేయకుండా క్రమశిక్షణ ఉల్లంఘించాడన్నారు. ఆయనతోపాటు వెనుకాల ఉండి నడిపిస్తున్న నాయకుల అంశాన్ని మరోసారి అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానన్నారు. జంగాకు ఎవరు సహకరించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. గతంలో కొండా మురళి టీఆర్‌ఎస్‌లో ఉన్న సమయంలో ఎమ్మెల్సీగా నామినేషన్ వేస్తే.. జంగా రాఘవరెడ్డి కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్సీగా నామినేషన్ వేస్తానని చెప్పి మరుసటిరోజు ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి కేరళ పోయాడని, కోవర్టు రాజకీయాలకు జంగా పెట్టింది పేరన్నారు.

సస్పెండ్ చేసే అధికారం 'నాయిని'కి లేదు..

డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జంగా రాఘవరెడ్డి

కాజీపేట: కాంగ్రెస్ పార్టీ అభివృద్ధే లక్ష్యంగా ఉమ్మడి జిల్లాలో టీపీసీసీ పిలుపు మేరకు పనిచేస్తున్న తనను సస్పెండ్ చేసే అధికారం హనుమకొండ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డికి లేదని డీసీసీబీ మాజీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. కాజీపేట చౌరస్తాలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ టీపీసీసీ సభ్యుడిగా ఉన్న తనపై క్రమశిక్షణా రాహిత్యం జరిగితే రాష్ట్ర పార్టీ విచారించి చర్యలు తీసుకుంటుందనే విషయం నాయినికి తెలియకపోవడం విచారకరమన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో అధికార పార్టీ నాయకుడి వద్ద డబ్బులు తీసుకొని మిత్రపక్షాల అభ్యర్థి రేవూరి ప్రకాశ్‌రెడ్డిని ఓడించిన ఘన చరిత్ర ఎవరిదో ఉమ్మడి జిల్లాలో ఎవరిని అడిగినా చెబుతారని ఎద్దేవా చేశారు. తానేదైనా తప్పుచేసినట్లుగా భావిస్తే అధిష్టానానికి ఫిర్యాదు చేయకుండా ఏకంగా పత్రికలకెక్కడం క్రమశిక్షణా రాహిత్యం కాదా.. అని ఆయన ప్రశ్నించారు. ఆరునూరైనా వరంగల్ పశ్చిమ నియోజకవర్గం నుంచే పోటీచేసి తీరుతానని స్పష్టం చేశారు. సమావేశంలో కార్పొరేటర్లు జక్కుల రవీందర్‌యాదవ్, విజయశ్రీ రజాలి, కాంగ్రెస్ నాయకులు తోట్ల రాజుయాదవ్, సయ్యద్ రజాలి, బోయిని కుమార్‌యాదవ్, గుర్రపు కోటేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

శరవేగంగా 'సూపర్ స్పెషాలిటీ' పనులు



ఆస్పత్రి నిర్మాణ మ్యాప్‌ను పరిశీలిస్తున్న మంత్రి ప్రశాంత్‌రెడ్డి, పక్కన ఎమ్మెల్యే నరేందర్, కలెక్టర్

- 24 అంతస్తుల్లో 2వేల పడకలతో నిర్మాణం
- సెప్టెంబర్‌లోగా ఆస్పత్రి పనులు పూర్తి..
- డిసెంబర్‌లో అందుబాటులోకి..
- నిర్మాణ పనులను పరిశీలించిన మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

ఎంజీఎం: దేశంలో ఎక్కడా లేని విధంగా వరంగల్ నగరంలో 24 అంతస్తుల్లో 2వేల పడకల సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణం జరుగుతున్న తీరు.. ఏ విధంగా సివిల్ పనులు కొనసాగుతున్నాయో.. ఎలాంటి ప్రణాళిక ప్రకారం ముందుకు సాగుతున్నారో అనే విషయాలను మంత్రి ప్రశాంత్‌రెడ్డికి ఎల్‌అండ్‌టీ ప్రతినిధులు మ్యాప్ ద్వారా వివరించడంతోపాటు స్వయంగా చూపించారు. పనుల పురోగతిపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ పేదలకు కార్పొరేటర్ స్థాయిలో వైద్యం అందించాలనే ఉద్దేశంతో వరంగల్‌లో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిని నెలకొల్పుతున్నట్లు పేర్కొన్నారు. సీఎం అన్ని జిల్లాల్లో వైద్య కళాశాలలు ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ఉన్నారన్నారు. 42 ఎకరాల స్థలంలో 24 అంతస్తుల్లో 2 వేల పడకల కోసం రూ.1,200కోట్లు ఖర్చు చేసి ఆస్పత్రి నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఎల్‌అండ్‌టీ సంస్థ నిర్మాణ పనులు చేపట్టిందని, ఇప్పటికే 60 శాతం మెయిన్ బిల్డింగ్ స్ట్రక్చర్ పనులు పూర్తయినట్లు తెలిపారు. సెప్టెంబర్‌లోగా ఆస్పత్రికి అవసరమైన అన్ని పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగుతున్నట్లు పేర్కొన్నారు. ఆస్పత్రి అందుబాటులోకి వస్తే జనగామ, హనుమకొండ, మహబూబాబాద్, భూపాలపల్లి జిల్లాల ప్రాంత ప్రజలకు హైదరాబాద్ తరహాలో కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి వస్తుందన్నారు. ఇంత పెద్ద ప్రాజెక్టు ప్రభుత్వ రంగంలో చేపట్టడం ఆషామాషీ కాదని, దేశంలో చాలా అరుదుగా ఇలాంటి ఆస్పత్రి నిర్మాణాలు జరుగుతాయన్నారు. పనులు మొదలు పెట్టిన రోజు నుంచి 24 గంటలపాటు వేగంగా నడుస్తున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో వరంగల్ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్, వరంగల్ అదనపు కలెక్టర్ శ్రీవత్స, ఆర్డీఓ జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి

సీపీ రంగనాథ్

వరంగల్ క్రైం: పోలీసు సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏ.వీ.రంగనాథ్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన అల్పాహార క్యాంటీన్‌ను సీపీ రంగనాథ్ సోమవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో వివిధ విభాగాల్లో విధులు నిర్వహించే సిబ్బందితోపాటు కార్యాలయాన్ని సందర్శించే పోలీస్ సిబ్బంది, సందర్శకుల సౌకర్యార్థం క్యాంటీన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈస్ట్‌జోన్ డీసీపీ కరుణాకర్, పరిపాలనా విభాగం అదనపు డీసీపీ పుష్పారెడ్డి, ఆర్మ్‌డ్ రిజర్వ్ అదనపు డీసీపీలు సంజీవ్, సురేష్‌కుమార్, ఏసీపీలు నాగయ్య, అంతయ్య, సురేందర్, ఏఓ రామకృష్ణస్వామి, ఆర్‌ఐలు నగేష్, భాస్కర్, చంద్రశేఖర్, ఆర్‌ఎస్సైలు, పరిపాలనా విభాగం సిబ్బంది పాల్గొన్నారు.



క్యాంటీన్‌ను ప్రారంభిస్తున్న సీపీ రంగనాథ్

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్: ప్రజల నుంచి వివిధ రకాల సమస్యలపై స్వీకరించిన వినతులు సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి కలెక్టర్ హాజరై ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినతుల పరిష్కారంలో అధికారులు జాప్యం చేయకుండా తర్వతగతిన పరిష్కరించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రజావాణిలో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ 8, 2బీహెచ్‌కే డిస్ట్రిక్ట్ నోడల్ ఆఫీసర్ 6, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ 6, కలెక్టరేట్ డీ సెక్షన్ 5లతోపాటు మొత్తం 74 దరఖాస్తులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్వో వాసుచంద్ర, డీఆర్‌డీఓ శ్రీనివాస్, డీఎంహెచ్‌ఓ సాంబశివరావు, డీపీఓ జగదీశ్వర్, డీఎండబ్ల్యూఓ శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, డీటీడీఓ ప్రేమకళారెడ్డి, డీసీఎస్‌ఓ వసంతలక్ష్మి, సీపీఓ సత్యనారాయణరెడ్డి, ఎల్‌డీఎం శ్రీనివాస్, ఏడీ మైనింగ్ నర్సిరెడ్డి, ఏడీ సర్వే అండ్ ల్యాండ్ రికార్డు ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీవత్స

వినతులు త్వరగా పరిష్కరించాలి: అదనపు కలెక్టర్ శ్రీవత్స కోట

వరంగల్ రూరల్: గ్రీవెన్స్‌లో వచ్చిన సమస్యలను అర్హత మేరకు త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ శ్రీవత్స కోట అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల అభ్యర్థనలు అధికారులు పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఏప్రిల్ 3వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు.

ఫిర్యాదులు ఇలా

భూ సమస్యలు 25, ఆర్డీఓ కార్యాలయం 3, డీఆర్‌డీఓ 10, ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయం 15, ఎంజీఎం సూపరింటెండెంట్ 2, పోలీస్ కమిషనరేట్ 2, డీపీఓ 1, వరంగల్ మున్సిపాలిటీ 1, డీటీఓ 1, వివిధ సమస్యలపై 15 వినతులు రాగా.. మొత్తం 77 అభ్యర్థనలు స్వీకరించారు. ప్రజావాణిలో డీసీఓ సంజీవరెడ్డి, జిల్లా ముఖ్యప్రణాళికాధికారి గుర్రాల జీవరత్నం, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు ఫోన్ ఇన్

నేడు, రేపు సబ్జెక్టులవారీగా సందేహాల నివృత్తి

కాజీపేట సెంటర్: ఏప్రిల్ 3వ తేదీ నుంచి జరగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు 10/10 జీపీఏ సాధనకు వరంగల్ జిల్లా విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ సిద్ధం చేసింది. ఇప్పటికే ప్రత్యేక తరగతులు నిర్వహించి సిలబస్ పూర్తి చేసి ఓరియంటేషన్, మోటివేషన్ తరగతులు నిర్వహించారు. మళ్లీ పరీక్షలు దగ్గరపడుతున్న వేళ విద్యార్థుల్లో మనోధైర్యం కల్పించేలా సందేహాలు, అనుమానాలను నివృత్తి చేయడానికి ఈనెల 28, 29 రోజుల్లో ఫోన్ ఇన్ నిర్వహించనున్నారు. జిల్లాలో పదో తరగతి విద్యార్థులు 9,728 మంది ఉన్నారు.

28న నిర్వహించే ఫోన్ ఇన్

సబ్జెక్టు	సమయం	సెల్ నంబర్
తెలుగు	మధ్యాహ్నం 2-3	8919328582, 8008791827
హిందీ	3-4	8341442636, 8790795161
ఇంగ్లిష్	4-5	9700356559, 9441136784

29న నిర్వహించే ఫోన్ ఇన్

సబ్జెక్టు	సమయం	సెల్ నంబర్
గణితం	మధ్యాహ్నం 2- 3	8074949620, 9849149045
భౌతిక, జీవశాస్త్రాలు	3-4	9247851997, 9949107887
సాంఘిక శాస్త్రం	4-5	9247851997, 9949107887

వసతుల కల్పన, సమస్యలపైనే అర్జీలు

బల్దియా గ్రీవెన్స్ సెల్‌కు 60 ఫిర్యాదులు

వరంగల్ అర్బన్: కాలనీల్లో మౌలిక వసతుల కల్పన, వ్యక్తిగత సమస్యలపైనే అధికంగా ఫిర్యాదులు నమోదయ్యాయి. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో వింగ్ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. మొత్తం 60 ఫిర్యాదులు రాగా.. వాటిలో తాగునీటి సమస్యలపై 9, అక్రమ నిర్మాణాలపై (టౌన్ ప్లానింగ్) 31, పన్నుల విభాగానికి 9, ఉద్యానవన విభాగానికి 3, ప్రజారోగ్యానికి 2, ఇంకా ఇతర ఫిర్యాదులు నమోదయ్యాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రవీందర్ యాదవ్, డిప్యూటీ కమిషనర్లు అనిసుర్ రషీద్, జోనా, ఎస్‌ఈలు కృష్ణారావు, ప్రవీణ్‌చంద్ర, సిటీ ప్లానర్ వెంకన్న, సీహెచ్‌ఓ మాధవరెడ్డి, సీఎంహెచ్‌ఓ రాజేష్, ఎంహెచ్‌ఓ జ్ఞానేశ్వర్, ఈఈలు,డీఈలు, ఏసీపీలు తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని ఇలా..

- రామన్నపేట 12-8-171/2 నల్లా పైపులైన్ నుంచి మురుగునీరు వస్తుందని, బిల్లు సక్రమంగా చెల్లిస్తున్నానని కె.సంతోష్‌కుమార్ ఫిర్యాదు చేశారు.
- 11 డివిజన్ పోతన నగర్ శ్మశాన వాటికలో కనీస సదుపాయాలు కల్పించాలని, ఏఈకి ఎన్నిమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని సందెల కుమార్ ఫిర్యాదు చేశారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న వింగ్ అధికారులు

- 36వ డివిజన్ చింతల్ డ్రెయినేజీ లేక ఇళ్ల మధ్యలో ఖాళీ స్థలాల్లో మురికి కూపాలుగా మారుతున్నాయని, వెంటనే పనులు చేపట్టాలని స్థానికులు కోరారు.
- పైడిపల్లికి చెందిన కుమారస్వామి తన భవన నిర్మాణానికి దరఖాస్తు చేసి రూ.75,282 చెల్లించానని, దానిని రిజెక్ట్ చేశారని, తిరిగి డబ్బులు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు.
- జాన్‌పీరీలకు చెందిన సమ్మయ్య తన ఇంటి పేరు లేకుండా తన ఇంటిని అసెస్‌మెంట్ కాపీతో తప్పుడు రిజిస్ట్రేషన్ చేసుకున్నాడని, దానిని రద్దు చేయాలని శ్రీరాముల సమ్మయ్య వినతిపత్రం అందజేశారు.
- 64వ డివిజన్ మడికొండలో డ్రెయినేజీ నిర్మించాలని స్థానికులు వినతిపత్రం అందజేశారు.
- బాలసముద్రంలోని పిల్లల పార్కులో ఫొటోలు తీసుకుంటే రూ.5వేల నుంచి రూ.10వేల వరకు వసూలు చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.
- వరంగల్ కాశికుంట హిందూ ఆరెకటిక శ్మశాన వాటిక పనులు నత్తనడకన సాగుతున్నాయని, వాటిని వేగవంతం చేయాలని అధ్యక్షుడు గోగికార్ రవీందర్ కోరారు.
- ఏనుమాముల సుందరయ్య నగర్‌లో సర్వే నం.180 ప్రభుత్వ భూమి సర్వే చేసి కాపాడాలని తెలుగు బాప్టిస్ట్ చర్చి ప్రతినిధులు విన్నవించారు.
- వాటర్ ట్యాంక్‌ల ఆపరేటర్లకు యూనిఫాం ఇప్పించాలని టీఆర్‌ఎస్‌కేవీ నాయకుడు కొత్తపల్లి శ్రీనివాస్, ఆపరేటర్లు అర్జీ అందజేశారు.

నిట్ కళాశాలలో హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ అతుల్య రవి



నిట్‌లో 'మీటర్'

నిట్ వరంగల్‌లో సినీ హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ అతుల్య రవి సందడి చేశారు. ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిట్ కళాశాలలో నిర్వహించనున్న స్ప్రింగ్‌స్ప్రీ-23 కళాధ్వని వేడుకల్లో భాగంగా 'మీటర్' సినిమా ప్రమోషన్స్‌లో హీరో, హీరోయిన్లు సోమవారం విద్యార్థులతో చిట్‌చాట్‌తో అలరించారు. -8లో▸ - కాజీపేట అర్బన్

ఒకే ఇంటికి 2, 3 నల్లాలు

అస్తవ్యస్తంగా క్రమబద్ధీకరణ వ్యవహారం

వరంగల్ అర్బన్: నగరంలో నల్లా కనెక్షన్ల క్రమబద్ధీకరణ వ్యవహారం అస్తవ్యస్తంగా మారింది. ఒక ఇంటికి రెండు, మూడు నల్లా కనెక్షన్లు ఉన్నట్లు ఫీజు విధించడంతో యజమానుల్లో గుబులు మొదలైంది. అక్రమ నల్లా కనెక్షన్లు, అమృత్ మిషన్ భగీరథ కొత్త నల్లాల క్రమబద్ధీకరణలో భాగంగా ఏఈలు, మెప్మా రిసోర్స్ పర్సన్(ఆర్‌పీ) ఇష్టారాజ్యంగా నల్లాలను గుర్తించి 'ఆన్‌లైన్'లో నమోదు చేయడంతో సమస్య కొత్త మలుపు తిరిగింది. దీంతో ఇళ్ల యజమానులు ఇంటికి ఒకే నల్లా ఉంటే రెండు, మూడు నల్లాలు ఉన్నట్లు చార్జీలు విధించడం ఏమిటని అధికారులను నిలదీస్తున్నారు. దీనిపై బల్దియా గ్రీవెన్స్ సెల్‌లో పెద్ద మొత్తంలో ఫిర్యాదులు నమోదవుతున్నాయి. ఇంటికి ఉన్న ఒక్క నల్లా కనెక్షన్ నుంచి నీళ్లు ప్రెషర్‌తో రావడం లేదని, రెండు, మూడు ఎందుకు పెట్టారనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి. గతంలో ఉన్న నల్లాలు, నల్లాలు లేని ఇంటి నంబర్లు, అమృత్ అర్బన్ మిషన్ భగీరథ కింద ఏర్పాటు చేసిన నల్లాలను వాస్తవాలను పరిగణనలోకి తీసుకోలేదు. క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించకుండా ఎడాపెడా కనెక్షన్లను 'ఆన్‌లైన్'లో నమోదు చేయడంతో ఇలా రెండు, మూడు చొప్పున నల్లా కనెక్షన్లు నమోదయ్యాయి. దీనిపై ఇంజనీర్లను వివరణ కోరితే.. ఫిర్యాదు చేస్తే విచారణ చేసి తొలగిస్తామని పేర్కొన్నారు.

- మడికొండకు చెందిన కృష్ణమూర్తి ఇంటి నం.30-8-18, నల్లా కనెక్షన్ నం.85379 ఉంది. 2018 నుంచి మరో నల్లా, 2022 నుంచి ఇంకో నల్లా మొత్తం ఒకే ఇంటికి మూడు నల్లాలు ఉన్నట్లుగా చార్జీ విధించారు.
- కరీమాబాద్ అనంతలక్ష్మి 17-3-74 ఇంటికి నల్లా కనెక్షన్ ఉంది. అదనంగా మారో నల్లా, రెండు కనెక్షన్ల చార్జీ.. నెలకు రూ.300 చొప్పున 'ఆన్‌లైన్' చూపిస్తోంది.
- ఇలా నగరంలో వేలాది ఇళ్లకు ఒక ఇంటికి, రెండు, మూడు చొప్పున నల్లా కనెక్షన్లు ఉన్నట్లు చార్జీలు విధించడంతో యజమానులు ఆందోళన చెందుతున్నారు.

కేయూ మాజీ రిజిస్ట్రార్ లక్ష్మీపతి మృతి


లక్ష్మీపతి(ఫైల్)

కేయూ క్యాంపస్: కేయూ జువాలజీ విభాగం విశ్రాంత ఆచార్యులు, మాజీ రిజిస్ట్రార్ ఆచార్య వడ్లకొండ లక్ష్మీపతి(78) హైదరాబాద్‌లో సోమవారం మృతి చెందారు. మార్నింగ్ వాక్ చేస్తూ గుండెపోటుతో మరణించారని సమాచారం. బుధవారం మధ్యాహ్నం హైదరాబాద్‌లో అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు. లక్ష్మీపతి కేయూ రిజిస్ట్రార్‌గా 2003 నుంచి 2005 వరకు పని చేశారు. జువాలజీ విభాగంలో దాదాపు 30 ఏళ్ల పాటు అధ్యాపకుడిగా పని చేశారు. ఆయన ఉద్యోగ విరమణ పొందాక యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్, నైపర్, ఫార్మసీ సంస్థలో అతిథి ఆచార్యులుగా పని చేశారు. లక్ష్మీపతి మృతికి కేయూ వీసీ తాటికొండ రమేశ్, రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు, జువాలజీ విభాగాధిపతి మామిడాల ఇస్తారి సంతాపం తెలిపారు.

ఇద్దరికి జీవిత ఖైదు

నర్సింహులపేట: చిన్నగూడూరు మండలం గుండంరాజుపల్లిలో 2014లో కుటుంబ తగాదాలతో కుంట యాదగిరిని హత్య చేసిన ఘటనలో ఇద్దరు నిందితులకు సోమవారం మహబూబాబాద్ జిల్లా కోర్టు జీవిత ఖైదు విధించినట్లు ఎస్సై మంగీలాల్ తెలిపారు. యాదగిరి హత్యకు గురైనట్లు డిసెంబర్ 2014లో ఆయన కుమారుడు నరేశ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇదే గ్రామానికి చెందిన కుంట సురేశ్, చిల్ల ఉప్పలయ్యను నిందితులుగా పేర్కొని జిల్లా కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు. నిందితులిద్దరికీ ప్రిన్సిపల్ డిస్ట్రిక్ట్ జడ్జ్ రూ.1000 జరిమానా, జీవిత ఖైదు విధించినట్లు ఎస్సై తెలిపారు. ఈకేసులో ట్రయల్ నడిపిన పీపీ వెంకటేశ్వర్లు, డీఎస్పీ రఘు, సీఐ సత్యనారాయణ, కోర్టు లైజన్ ఆఫీసర్ ఎండీ.గాలీబ్, ఎస్సై మంగీలాల్, కోర్టు పీసీ నరేందర్‌ను ఎస్పీ శరత్ చంద్రపవార్ అభినందించారు.

ఈ 'సారీ' లోటే!



- కేయూ అంచనా బడ్జెట్ రూ.389 కోట్లు!
- రూ.15 కోట్లకుపైగా లోటు బడ్జెట్ చూపే అవకాశం
- నేడు అకాడమిక్ సెనేట్ సమావేశంలో బడ్జెట్‌పై చర్చ, ఆమోదం

కేయూ క్యాంపస్: కేయూ 2023–24 ఆర్థిక సంవత్సరానికి వార్షిక అంచనాల బడ్జెట్ రూ.389 కోట్లకుపైగా ప్రవేశపెట్టబోతున్నట్లు సమాచారం. మంగళవా రం ఉదయం 11 గంటలకు 38వ అకాడమిక్ సెనేట్‌లో అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. ఈబడ్జెట్‌లో ప్రభుత్వం నుంచి బ్లాక్ గ్రాంట్ రూపేణారూ 127.55 కోట్లు రానున్నాయి. ఆనిధులు అధ్యాపకుల, నాన్‌టీచింగ్, పెన్షనర్ల జీతభత్యాలకే సరిపోనున్నాయి. మిగతా అంచనా బడ్జెట్‌కు అనుగుణంగా కేయూ అంతర్గత నిధుల నుంచి, పరీక్షల విభాగం, ఎస్‌డీఎల్‌సీఈ, ఎస్‌ఎఫ్‌సీ కోర్సుల నుంచి ఇతర అకాడమిక్ పరంగా ఫీజుల వనరుల నుంచి సమీకరించబోతున్నారు. ఆయా నిధులను వ్యయాలుగా చూపెట్టబోతున్నారు. ప్లానింగ్, నాన్‌ప్లానింగ్ బడ్జెట్‌గా 8 అంశాల్లో బడ్జెట్‌ను ప్రతిపాదించనున్నారు. ప్రభుత్వం ఇచ్చే బ్లాక్‌గ్రాంట్ అధ్యాపకుల, ఉద్యోగుల వేతనాలకే సరిపోతుండగా.. టైంస్కేల్, తాత్కాలిక ఉద్యోగులకు మాత్రం.. యూనివర్సిటీ తన అంతర్గత నిధుల నుంచే వేతనాలను చెల్లించుకోవాల్సిన పరిస్థితి. టీచింగ్, నాన్‌టీచింగ్ పెన్షనర్ల బెనిఫిట్స్‌ను కూడా యూనివర్సిటీ అంతర్గత నిధుల నుంచే ఇవ్వాల్సి వస్తోంది. ఆబెనిఫిట్స్ ఇవ్వడంలోనూ జాప్యం అవుతోంది. గత ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ఇచ్చే బ్లాక్‌గ్రాంట్‌తో పోలిస్తే ఈ ఆర్థిక సంవత్సరంలో బ్లాక్ గ్రాంట్ రూ.9.34 కోట్లు పెరిగింది. అయినప్పటికీ ఇది సరిపోదు. అలాగే.. అధ్యాపకుల, ఉద్యోగులకు పీఆర్సీతో వేతనాలు పెరిగాయి. డీఏలు కూడా చెల్లించాల్సి ఉంటుంది. రూ.15 కోట్లకు పైగా లోటు బడ్జెట్‌ను చూపెట్టబోతున్నట్లు సమచారం. కాగా.. అన్ని కోర్సులకు ఫీజులు భారీగానే పెంచారు. అందుకు అనుగుణంగా ప్రభుత్వం నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తే కొంత యూనివర్సిటీకి ఊరట కలిగే అవకాశం ఉంది.

అకాడమిక్ కార్యక్రమాలపై చర్చేది?

కేయూలో సెనేట్ సభ్యుల కొరత ఉంది. యూనివర్సిటీకి 16 ఏళ్ల క్రితం సెనేట్ సభ్యులను నియమించారు. కనీసం ఐదారేళ్లకోసారి సెనేట్ సభ్యులను నియమించాల్సి ఉంటుంది. కానీ రీ ఆర్గనైజ్ చేయడం లేదు. పలువురు సెనేట్ సభ్యులు మరణించినా.. వారి స్థానంలో కొత్తవారిని నియమించడంలేదు. సెనేట్‌ను కొత్తగా పునరుద్ధరించాలనే డిమాండ్ వ్యక్తం అవుతున్నా.. యూనివర్సిటీ అధికారులు అంతగా.. పట్టించుకోవడం లేదు. అకాడమిక్ సెనేట్, బడ్జెట్‌ను కలిపి సమావేశాన్ని నిర్వహిస్తున్నారు. బడ్జెట్‌ను ప్రవేశపెట్టాక కొద్దిసేపు చర్చించిన అనంతరం చప్పట్లతో ఆమోదించినట్లుగా ప్రకటిస్తున్నారు. అకాడమిక్ కార్యక్రమాలకు విద్యా సంవత్సరంలో ప్రత్యేకంగా చర్చించాలనేది ప్రతీ సెనేట్ సమావేశంలో పలువురు అభిప్రాయపడుతున్నప్పటికీ యూనివర్సిటీ అధికారులు ఓకే అనడం ఆతర్వాత మరిచిపోవడం పరిపాటిగా మారింది. అకాడమిక్ సెనేట్‌లో ఎప్పుడూ పూర్తిస్థాయిలో అకాడమిక్ కార్యక్రమాలపై చర్చలు జరగలేదంటే అతిశయోక్తి లేదు. ప్రస్తుతం 45 మంది అకాడమిక్ సెనేట్ సభ్యులున్నట్లు తెలుస్తోంది. అందులో ఎంతమంది హాజరవుతారో మంగళవారం తెలియనుంది.

రూ.22 కోట్లు పెరిగిన బడ్జెట్!

గత ఆర్థిక సంవత్సరం 2022–23లో రూ.367 కోట్లకుపైగా.. అంచనా బడ్జెట్‌ను ప్రతిపాదించిన విషయం తెలిసిందే. అయితే.. ప్రభుత్వం నుంచి బ్లాక్ గ్రాంట్ రూపేణా రూ.188.22 కోట్లు యూజీసీ ఏరియర్స్ రూ 32.81 కోట్లు మరో రూ.183.60 కోట్లు అంతర్గత నిధుల నుంచి సమీకరిస్తారని అంచనా బడ్జెట్‌లో పేర్కొన్నారు. లోటు రూ.33 కోట్లు చూపెట్టారు. అయితే ఆర్థిక సంవత్సరంలో రూ.211 కోట్లకు పైగా వ్యయం అయినట్లుగా తెలుస్తోంది. కాగా.. ప్రభుత్వం నుంచి వచ్చే గ్రాంటులో రూ.15.50 కోట్లు విడుదల చేయలేదని తెలుస్తోంది. 2023–24 ఆర్థిక సంవత్సరంలో కూడా ప్లానింగ్, నాన్‌ప్లానింగ్ బడ్జెట్‌లో రూ.389 కోట్లకు పైగా అంచనా ప్రతిపాదించి ప్రవేశపెట్టి అందులో ఆదాయ వ్యయాలను కూడా అంచనా వేశాక సుమారు రూ.15 కోట్లకు పైగానే లోటు బడ్జెట్ ఉండబోతోందని తెలుస్తోంది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే రూ.22 కోట్లకుపైగా ఈఆర్థిక సంవత్సరం అంచనా బడ్జెట్ పెంచినట్లు తెలుస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీకి ఇచ్చే నిధులకంటే వ్యయం ఎక్కువగా ఉంటుంది. అభివృద్ధి పనులకు గత ఎనిమిదేళ్లుగా ప్రభుత్వం నిధులు విడుదల చేయడం లేదు.

బడ్జెట్, వార్షిక నివేదిక, స్టాండింగ్ కమిటీ మినిట్స్

- కేయూ రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావు

కేయూ క్యాంపస్: కేయూ సెనేట్‌హాల్‌లో ఈనెల 28న ఉదయం 11గంటలకు జరిగే 38వ అకాడమిక్ సెనేట్ సమావేశంలో పద్దుల ఆమోదం, వార్షిక నివేదిక, వార్షిక బడ్జెట్ అంచనాల సమర్పణ ఉంటుందని సోమవారం కేయూ రిజిస్ట్రార్ ఆచార్య టి.శ్రీనివాస్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈసమావేశంలో 2020–2021 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన పద్దుల ఆమోదం, 2023–24 ఆర్థిక సంవత్సరం వార్షిక బడ్జెట్ అంచనాల సమర్పణ ఉంటుందని పేర్కొన్నారు. 2022–23 విద్యాసంవత్సరానికి సంబంధించిన స్టాండింగ్ కమిటీ మినట్స్‌ను కూడా ఉంటుందని తెలిపారు. సమావేశంలో పాలకమండలి సభ్యులు, వివిధ విభాగాల డీన్‌లు, ప్రిన్సిపాళ్లు, అధికారులు పాల్గొంటారని పేర్కొన్నారు.

ఇంటర్ పరీక్ష రాస్తున్న విద్యార్థికి ఫిట్స్

ఎంజీఎంకు తరలింపు


చికిత్స పొందుతున్న విద్యార్థి ధరణి

ఎంజీఎం: వరంగల్ ఏవీవీ కళాశాలలో మేధా ఇంటర్మీడియట్ కళాశాలకు చెందిన ధరణి సోమవారం ఇంటర్ పరీక్ష రాస్తున్న క్రమంలో ఫిట్స్ వచ్చింది. కళాశాల సిబ్బంది వెంటనే అప్రమత్తమై 108 అంబులెన్స్‌లో ఎంజీఎంకు తీసుకెళ్లి చికిత్స అందించారు. విద్యార్థి తల్లిదండ్రులు ఎంజీఎంలో చికిత్స పొందుతున్న కూతురును ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

వేర్వేరు కారణాలతో ముగ్గురి ఆత్మహత్య

సంగెం: కుటుంబ సమస్యలు, వడగండ్ల వానతో పంట నష్టం ఇవన్నింటితో జీవితంపై విరక్తి చెందిన మండలంలోని చింతలపల్లి గ్రామానికి చెందిన కొలువుల నీల(52) ఆదివారం రాత్రి కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంది. నీల కుమారుడికి రెండేళ్ల క్రితం ఏనుగల్లు గ్రామానికి చెందిన రవళికతో వివాహం జరిగింది. ఆమె ఆరోగ్యం బాగలేక రూ.3 లక్షలు చికిత్స కోసం ఖర్చయ్యాయి. కాగా.. కుమారుడికి విడాకులు ఇవ్వాలనుకున్నారు. ఇరు వర్గాల పెద్ద మనుషుల తీర్పు ప్రకారం.. రూ. 20 లక్షలు చెల్లించాలని నిర్ణయించారు. కాగా.. మూడెకరాల పది గుంటల భూమిని కౌలుకు తీసుకుని అందులో మిర్చి, మొక్కజొన్న సాగు చేశారు. ఇటీవలి వడగండ్ల వానకు పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో కోడలు విడాకుల కోసం రూ. 20 లక్షలు, పంటల కోసం చేసిన అప్పులు తీర్చే పరిస్థితి లేక మనస్తాపానికి గురై ఆదివారం రాత్రి సీతారాంనగర్ సమీపంలో ఎస్సారెస్పీ కెనాల్‌లో దూకి ఆత్మహత్య చేసుకుంది. భర్త సాంబయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై భరత్ తెలిపారు.

మృతదేహం లభ్యం


నీల మృతదేహం

చెన్నారావుపేట: మండలంలోని సూర్యపేట తండా సమీపంలోని ఎస్సారెస్పీ (డీబీఎం–40) కాలువలో సోమవారం ఉదయం నీల మృతదేహం లభ్యమైంది. అడ్డబాట తండాకు చెందిన రైతు వాల్యానాయక్ కొట్టుకొస్తున్న మృతదేహాన్ని ఆపి తాడు సాయంతో సమీపంలో చెట్టుకు కట్టేసి పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఎస్సై తోట మహేందర్ మృతదేహాన్ని పరిశీలించారు.

తాగొద్దన్నందుకు..

శాయంపేట: మద్యం తాగొద్దని భార్య వారించినందుకు మండలంలోని మందారిపేట గ్రామానికి చెందిన కుక్కల సతీశ్ (33) సోమవారం ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సతీశ్ గొర్రెలను కాస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కొంత కాలం నుంచి మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం ఉదయాన్నే మద్యం సేవించిన సతీశ్ ఇంటికి రావడంతోనే అతడి భార్య నాగరాణి గొర్రెలను మేపకుండా మద్యం తాగడం ఎందుకని? మద్యం సేవించవద్దని మందలించింది. నాగరాణి, ఆమె అత్త లింగమ్మ ఇద్దరూ గొర్రెలను మేపేందుకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి వచ్చే సరికి సతీశ్ ఇంట్లో తాడుతో ఉరేసుకుని మృతి చెందాడు. మృతుడి భార్య నాగమణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై ఇమ్మడి వీరభద్రరావు తెలిపారు.

రైలుకింద పడి యువకుడు..


కార్తీక్(ఫైల్)

జనగామ: జనగామ జిల్లా యశ్వంతాపూర్ వాగు వద్ద రైలు కింద పడి భువనగిరి యాదాద్రి జిల్లా ఆలేరు మండలం పటేల్‌గూడెం గ్రామానికి చెందిన కార్తీక్(21) ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్నెళ్ల క్రితం గుండెపోటుతో మృతి చెందిన తండ్రిని తలుచుకుంటూ.. మానసిక వేదనకు గురైన కార్తీక్ సోమవారం రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ కానిస్టేబుల్ నరేశ్ తెలిపారు.

'బరువు' బాధలు

- మిర్చి బస్తా 50 కిలోలు దాటితే కొనుగోలు చేయమని మార్గదర్శకాలు
- ఏప్రిల్ 1 నుంచి మార్కెట్‌లో అమలు
- రైతుల నుంచి వ్యతిరేకత



వరంగల్: ఆరుగాలం కష్టపడి పండించిన పంటలను అమ్ముకునేందుకు రైతులు అష్టకష్టాలు పడాల్సి వస్తుంది. వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు రైతులు విక్రయించేందుకు తెచ్చే మిర్చి బస్తా 25 కిలోలకు పైన ఉండి 49 కిలోలకు తక్కువ బరువు ఉంటేనే క్రయవిక్రయాలు జరుపుతామని మార్కెటింగ్ శాఖ అధికారులు మార్గదర్శకాలు జారీ చేశారు. సోమవారం పలు మార్గదర్శకాలతో కూడిన ప్రకటనను మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దిడ్డి భాగ్యలక్ష్మి విడుదల చేశారు. దీంతో రైతులకు మిర్చి బస్తాల బరువు బాధలు తప్పేలా లేవు.

రైతులకు ఇబ్బందులే...

వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ తీసుకున్న నిర్ణయంతో రైతులు, రైతు సంఘాల నుంచి వ్యతిరేకత వ్యక్తం అయ్యే అవకాశాలున్నాయి. రైతులు పండించిన మిర్చిని దాదాపు 50 కిలోలు ఉండే విధంగానే తీసుకువస్తున్నారు. అయితే పంటలో మొత్తం బస్తాల్లో తీసుకురాగా మిగిలిన మిర్చిని రైతులు ఏం చేసుకోవాలనే ప్రశ్న ఉత్పన్నం అవుతోంది. ఖమ్మం జిల్లాలో ఈ విధానం అమలులో ఉన్నట్లు తెలిసింది. కేవలం మిర్చి కొనుగోలు దారులు, కోల్డ్ స్టోరేజీల నిర్వాహకుల ఒత్తిళ్ల మేరకే ఈ విధానం అమలు చేసేందుకు కమిటీ నిర్ణయం తీసుకుందని రైతు సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాల ప్రకారం ఒక బస్తా 50 కిలోలు మించొద్దని ఉందని, తక్కువ (25 కిలోల కంటే) తీసుకువస్తే కొనుగోలు చేయవద్దని లేదని అంటున్నారు. ఈ నిబంధనను తీసేయాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

మార్గదర్శకాలు ఇలా..

- మార్కెట్‌కు తమ సరుకును అమ్మకునేందుకు తెచ్చే ప్రతి రైతు లాట్ ఐడీ తప్పనిసరిగా తీసుకురావాలి.
- మిర్చి బస్తా 25 కిలోలకు పైన ఉండి 49 కిలోలకు తక్కువ బరువు ఉండేలా చూసుకోవాలి.
- దడవాయిల ద్వారానే తూకం వేయించిన అనంతరం తూకం పట్టి (వేమెంట్ స్లిప్) పొందాలి. మిర్చిలో తేమ (నిమ్ము), చెత్త, చేదారం లేకుండా శుభ్రపరిచిన సూక (ఎండిన) మిర్చిని మాత్రమే మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయించాలి.
- తేమతో కూడిన మిర్చిని అమ్మకానికి మార్కెట్‌కు తీసుకురావడంతో వ్యాపారస్తులు ఆ మిర్చిని కొనుగోలు చేయడానికి నిరాసక్తత చూపుతున్నారు.
- మిర్చి నుంచి తాలు మిర్చిని వేరు చేసుకుని తీసుకురావాలి.


మార్కెట్‌లో నిబంధనల ఫ్లెక్సీని విడుదల చేస్తున్న కార్యదర్శి రాహుల్

గంజాయితో పట్టుబడిన ఇద్దరి అరెస్ట్

- పరారీలో ఒకరు


నిందితుల అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కాజీపేట: కాజీపేటలో సోమవారం 2.100 కిలోల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేసినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ జితేందర్ రెడ్డి తెలిపారు. కాజీపేట టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పట్టణానికి చెందిన మహాద్ నజీమ్, జమ్మికుంటకు చెందిన పాకాల విక్రత్‌రెడ్డి, సాహెబ్ గంజాయితో పట్టుబడ్డారు. వీరిలో విక్రత్‌రెడ్డి, నజీమ్‌లను పోలీసులు అరెస్ట్ చేయగా.. సాహెబ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. నిందితుల నుంచి గంజాయితో పాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. సీఐలు కె.శ్రీనివాస్‌రావు, ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్సైలు లవన్‌కుమార్, ప్రమోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అక్కను కొట్టిన తమ్ముడిపై కేసు

ఖిలా వరంగల్: వారసత్వంగా వచ్చే ఆస్తి విషయంలో అక్కను కొట్టిన తమ్ముడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాంబయ్య తెలిపారు. ఆయన తెలిపిన కథనం ప్రకారం.. వరంగల్ రంగశాయిపేట నెహ్రూ విగ్రహం సమీప కాలనీకి చెందిన గుమ్మడి ఇందిర తల్లిదండ్రుల ఆస్తి విషయంపై అతడి తమ్ముడు మునికుంట్ల ఆగయ్యతో సోమవారం గొడవ జరిగింది. ఈగొడవల్లో అక్కపై తమ్ముడు దాడి చేశాడు. ఆగయ్యపై ఇందిర ఫిర్యాదు చేయగా.. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నకిలీ డాక్యుమెంట్ సృష్టించిన వ్యక్తిపై..

ఖిలా వరంగల్: మామ ఇంటిపై నకిలీ డాక్యుమెంట్ సృష్టించి భయభ్రాంతులకు గురి చేస్తున్న అల్లుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మిల్స్‌కాలనీ ఏరియా గాంధీనగర్‌లో చింతపండు సంజీవ్‌కు ఇల్లు ఉంది. అతడి అల్లుడైన లక్కం ప్రసాద్ మామ ఇంటిని కాజేసేందుకు నకిలీ డాక్యుమెంట్ సృష్టించి మామను బెదిరిస్తున్నాడు. దీంతో చింతపండు సంజీవ్ చిన్నాన్న శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై కుమార్ తెలిపారు.

కుక్క దాడిలో బాలుడికి గాయాలు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మండలం బలరాం తండాకు చెందిన లకావత్ భాస్కర్ ఎనిమిదేళ్ల కుమారుడు జశ్వంత్ పై వీధి కుక్క ఆదివారం రాత్రి దాడి చేసింది. ఈదాడిలో బాలుడి జననేంద్రియానికి తీవ్రగాయమైంది. ఇంటి ఆవరణలో ఆడుకుంటుండగా.. వీధి కుక్క జశ్వంత్‌పై దాడి చేసింది. వెంటనే అతడిని తండ్రి భాస్కర్ చికిత్స నిమిత్తం మానుకోట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తీసుకొచ్చి వ్యాక్సిన్ వేయించారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురి మృతి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వేర్వేరు ఘటనల్లో సోమవారం ముగ్గురు మృతి చెందారు.


ధనసరి చిన్న లక్ష్మయ్య(ఫైల్)

గంగారం: తాటి కల్లు తాగి తీవ్ర అస్వస్థతకు గురైన మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం జంగాలపల్లికి చెందిన ధనసరి చిన్న లక్ష్మయ్య(50) చికిత్స పొంది ఇంటికి రాగానే ఆదివారం రాత్రి మృతి చెందాడు. లక్ష్మయ్య వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. తన భూమిలో ఉన్న తాటి చెట్లను ఆయన ఎక్కి కల్లు తీసి అమ్ముతున్నాడు. అయితే.. ఉగాది పండుగను పురస్కరించుకుని లక్ష్మయ్య వ్యవసాయ భూమిలోని తాటిచెట్లు ఎక్కి కల్లు దింపి ఇంటికి తీసుకొచ్చాడు. ఆయన కుటుంబ సభ్యులు ఐదుగురు కలిసి కల్లు తాగారు. ఈక్రమంలో లక్ష్మయ్య, రాజశేఖర్ తీవ్ర అస్వస్థతకు గురవడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందించారు. ఈక్రమంలో రాజశేఖర్ కోలుకోగా.. రోజు రోజుకూ లక్ష్మయ్య ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. వైద్యులు బతకడం కష్టమే ఇంటికి తీసుకెళ్లాలని సూచించడంతో లక్ష్మయ్యను ఇంటికి తీసుకొచ్చారు. ఆదివారం రాత్రి ఇంట్లోనే మృతి చెందాడు. తాటి చెట్టుపై ఉన్న కల్లులో ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు విషం కలపడంతోనే తన భర్త మృతి చెందాడని మృతుడి భార్య సారక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై ఉపేందర్ తెలిపారు.

చికిత్స పొందుతున్న రైతు..


థావుర్యా(ఫైల్)

మహబూబాబాద్ రూరల్: చికిత్స పొందుతూ మహబూబాబాద్ మండలం వేంనూర్ గ్రామ శివారు రాముర్తతండాకు చెందిన బానోత్ థావుర్యా(45) సోమవారం మృతి చెందాడు. థావుర్యాకు మూడెకరాల భూమి ఉంది. అందులో మిర్చి, రెండెకరాల వరి సాగు చేశాడు. పంటల సాగు కోసం రూ.6 లక్షల వరకు అప్పులు చేశాడు. అప్పు తీర్చే మార్గం లేక మనస్తాపానికి గురై ఈనెల 10న పురుగుల మందుతాగి ఆత్మహత్యకు యత్నించాడు. కుటుంబీకులు చికిత్స నిమిత్తం ఆయనను మానుకోట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రైతు మృతి చెందాడు. మృతుడి భార్య పూలమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సీహెచ్ అరుణ్‌కుమార్ తెలిపారు.

ప్రమాదవశాత్తు రైలు ఢీకొని ఒకరు..

కాశిబుగ్గ: వరంగల్–చింతలపల్లి రైల్వేస్టేషన్ల మధ్య అబ్బనికుంట మైసమ్మ దేవాలయం సమీపం రైలు ఢీకొని గుర్తు తెలయని వ్యక్తి(40–45) మృతి చెందినట్లు వరంగల్ జీఆర్పీ సీఐ నరేశ్ తెలిపారు. సోమవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి పట్టాలు దాటుతుండగా.. ఏదో రైలు నుంచి పడడం వల్ల మృతి చెందినట్లు భావిస్తున్నారు. మృతదేహంపై బూడిద కలర్ ప్యాంట్, వైట్‌కలర్ ఫుల్ షర్ట్ ఉన్నట్లు మృతదేహాన్ని వరంగల్ ఎంజీఎం మార్చురీలో భద్రపర్చినట్లు వివరాలకు 9441557232లో సంప్రదించాలని సీఐ తెలిపారు.

నిట్‌లో 'మీటర్' సందడి

ఉత్సాహం నింపిన సినీ హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ అతుల్య

కాజీపేట అర్బన్: నిట్ వరంగల్‌లోని అంబేడ్కర్ లర్నింగ్ సెంటర్ ఆడిటోరియంలో సోమవారం మీటర్ సినిమా హీరో కిరణ్ అబ్బవరం, హీరోయిన్ అతుల్య రవి సందడి చేశారు. నిట్ వరంగల్‌లో ఏప్రిల్ 7, 8, 9 తేదీల్లో నిర్వహించనున్న స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వని వేడుకల్లో భాగంగా మీటర్ మూవీ హీరో, హీరోయిన్లు తమ సినిమా ప్రమోషన్లో భాగంగా నిట్‌లో విద్యార్థులతో చిట్‌చాట్ చేసి అలరించారు. స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వని ఫిల్మ్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీటర్ సినిమా హీరో, హీరోయిన్ల లెట్స్ టాక్ షోలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈసందర్భంగా నిట్ విద్యార్థిని మేరి అడిగిన ప్రశ్నలతో పాటు విద్యార్థులతో ముఖాముఖి అయ్యారు. ఈ సందర్భంగా కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ.. 'మాది వ్యవసాయ కుటుంబం. పవన్‌కళ్యాణ్ స్ఫూర్తితో సినిమాల్లోకి వచ్చా. నేను తిరుపతిలో బీటెక్ చదువుతున్న తరుణంలో నా డ్రెస్సింగ్ చూసి వీడు వరెస్ట్ అని క్లాస్‌లోకి రానిచ్చేవారు కాదు. నాఫ్రెండ్స్ కూడా నన్ను వరెస్ట్ అని అనే వారు. కానీ చాలెంజ్‌గా తీసుకుని బెస్ట్‌గా ఎదిగాను' అన్నారు.

నిట్ విద్యార్థులు మీటర్ మోగించాలి..

'నేను తమిళ్ ఇండస్ట్రీ నుంచి తెలుగు ఇండస్ట్రీలో చేస్తున్న తొలి సినిమా మీటర్. ఏప్రిల్ 7న రిలీజ్ అవుతుంది, నిట్ విద్యార్థులు మీటర్ మోగించాలి. మూవీస్ చేస్తునే బీటెక్ పూర్తి చేసి ఎంటెక్ పూర్తి చేశాను. మీరంతా విద్యకు మొదటి ప్రాధాన్యం ఇచ్చాకే.. ఇష్టమైన రంగాన్ని ఎంచుకోండి' అని మీటర్ హీరోయిన్ అతుల్య రవి అన్నారు.

కలర్‌ఫుల్‌గా ఎథికల్ నైట్

నిట్ వరంగల్‌లోని టైమ్ స్క్వేర్ ప్లాజా ఆవరణలో సోమవారం రాత్రి స్ప్రింగ్‌స్ప్రీ–23 కళాధ్వనీ వేడుకల్లో భాగంగా సెంటర్‌ఫర్ వ్యాల్యూ ఎడ్యూకేషన్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎథికల్ నైట్ కలర్‌ఫుల్‌గా సాగింది. విద్యార్థులు సంప్రదాయ దుస్తుల్లో ఎత్నిక్‌వేర్ పేరిట నిర్వహించిన ప్రోగ్రాంలో అలరించారు. ఆరోహన్ డ్రామా పేరిట బాలీవుడ్ హీరో షారూఖ్‌ఖాన్, హీరోయిన్ దీపిక పదుకునే నటించిన ఓం శాంతి ఓం చిత్రాన్ని నాటక రూపంలో ఆవిష్కరించారు. ఆకాశంలోకి దీపాలను వదిలి లాంతర్ నైట్‌ను కలర్‌ఫుల్‌గా మార్చారు. నిట్ డైరెక్టర్ ఎన్వీ.రమణారావు దంపతులు విద్యార్థులకు జోష్‌ను అందించేలా చేపట్టిన ర్యాంప్‌వాక్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.


విద్యార్థుల కేరింతలు


విద్యార్థులతో మాట్లాడుతున్న సినీ హీరో కిరణ్ అబ్బవరం